
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 13 మే 2025

నేడు రిమ్స్‌లో ప్రత్యేక వైద్యసేవలు

శ్రీకాకుళం రిమ్స్, మే 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(బలగ - రిమ్స్)లో పచ్చకామెర్లు, కాలేయ సంబంధ వ్యాధులకు సంబంధించి మంగళవారం ప్రత్యేక వైద్యసేవలు అందజేయనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక వైద్యులతో ఉచిత పరీక్షలు, చికిత్స చేసి.. మందులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఉద్యాన పంటలకు ఊతం

- భారీగా రాయితీలు పెంచిన ప్రభుత్వం
- సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు
- జిల్లాకు రూ.2.62 కోట్లు కేటాయింపు
- రైతుల్లో ఆనందం

మెళియాపుట్టి మండలం నందవ గ్రామానికి చెందిన ఎస్.సూర్యనారాయణ అనే గిరిజన రైతు గతేడాది అర ఎకరా పొలంలో టమాట, రెండు ఎకరాల్లో తీపి గుమ్మడి పంట వేశాడు. ఈ పంటలకు గతంలో రూ.20వేలు రాయితీ అందేది. ఈ ఏడాది ప్రభుత్వం రాయితీని రూ.30వేలకు పెంచింది. దీంతో ఈ ఏడాది అదనంగా ఉద్యాన పంటలను సాగు చేయడానికి సూర్యనారాయణ సన్నద్ధమవుతున్నాడు.

మెళియాపుట్టి మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన నక్క వాసు అనే రైతు ఈ ఏడాది రెండు ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు పూల మొక్కలు పెంచడానికి సిద్ధమవున్నాడు. ప్రభుత్వం ఉద్యాన పంటలకు గిట్టుబాటు కల్పించడంతో పాటు రాయితీ పెంచడమే దీనికి కారణమని వాసు చెబుతున్నాడు.

మెళియాపుట్టి మండలం దీనబంధుపురంలో జగన్ అనే రైతు గత ఏడాది ఎకరా భూమిలో డ్రాగన్ ఫ్రూట్ పండించాడు. గతంలో దీనికి రూ.30వేలు రాయితీ ఇచ్చారు. ఈ ఏడాది నుంచి రూ.1.62లక్షలకు రాయితీని పెంచారు. దీంతో ఈ ఏడాది అదనంగా డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాడు.


దీనబందుపురంలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్

కంచిలి/మెళియాపుట్టి, మే 12(ఆంధ్రజ్యోతి): ఉద్యాన సాగును విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుతం ప్రత్యేక దృష్టి సారించింది. ఉద్యాన పంటలు పండించే రైతులకు భారీగా రాయితీలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో కలిసి చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రం 40 శాతం, కేంద్రం 60 శాతం మేర ఆర్థికసాయం అందించి రైతులను ప్రోత్సహిస్తున్నాయి. పంటలను బట్టి రాయితీలను వేర్వేరుగా అందించనున్నారు. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో ప్రస్తుతం 1.10లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటలను రైతులు సాగు చేస్తున్నారు. వీటి ద్వారా ఏటా 1.55 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 14,195 ఎకరాల్లో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచడానికి రూ.2.62 కోట్లు కేటాయించారు. ఉద్యాన రైతులకు సహాయం అందజేసి సాగు విస్తీర్ణం పెంచాలని అవగాహన కల్పిస్తున్నారు. వారికి అవసరమైన మొక్కలను నర్సరీల నుంచి తెప్పించి సబ్సిడీపై అందిస్తున్నారు. సాగుపై రైతులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉన్న పూలు, పండ్ల సాగుకు భారీ రాయితీలు ఇస్తూ, ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇటీవల ప్రజలు ఎక్కువగా ఉపయోగిస్తున్న డ్రాగన్‌ఫ్రూట్‌కు గతంలో ఎకరాకు రూ.30వేలు రాయితీ అందించగా, ఈ ఏడాది భారీగా రూ.1.62లక్షలకు పెంచారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటే రైతులు అధిక లాభాలను అర్జించవచ్చు.


కంచిలి మండలంలో బొప్పాయి సాగు

డ్రిప్ పరికరాలు కూడా..

ఉద్యాన పంటల సాగుకు అవసరమైన డ్రిప్ పరికరాలను కూడా రాయితీపై అందించనున్నారు. ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ, ఓసీ రైతులకు 90శాతం రాయితీ కల్పించనున్నారు. ఐదు దాటించి పది ఎకరాల వరకు ఉంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు 70శాతం, పది ఎకరాలు పైబడి ఉంటే 50 శాతం రాయితీ ఇవ్వనున్నారు.

సాగు విస్తీర్ణం లక్ష్యం ఇలా..

ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా ఉద్యాన సాగు పెంపునకు వేర్వేరు పథకాలను రూపొందించింది. జిల్లాలో 14,195 ఎకరాల్లో విస్తీర్ణం పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. సమగ్ర (మిగతా 6వ పేజీలో..)

రాయితీ ఇలా..

పంట రకం	గత ఏడాది(రూ.)	ప్రస్తుతం(రూ.)
డ్రాగన్ ఫ్రూట్	30 వేలు	1,62,000
జీడి	12 వేలు	18 వేలు
మామిడి	7,980	30 వేలు
జామ	17,599	48 వేలు
కొబ్బరి	12వేలు	18 వేలు
అరటి	30 వేలు	42 వేలు
పూల తోటలు (బంతి, చేమంతి, కనకాంబరం)	16 వేలు	20 వేలు
కూరగాయలు (సంకరజాతి)	20 వేలు	24 వేలు
నిమ్మ	9,602	30 వేలు
పైనాపిల్	26 వేలు	26 వేలు
బొప్పాయి	18 వేలు	18 వేలు

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులు, పరిష్కార వేదిక.. 'మీ-కోసం' కార్యక్రమంలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ-కోసం' కార్యక్రమంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. వివిధ సమస్యలపై జిల్లా ప్రజల నుంచి 119 అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వానికి తావులేదని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే పీజీఆర్ఎస్‌పై ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. బియాండ్ ఎస్ఎల్ఏ, పెండింగ్ అర్జీలు, రీ-ఓపెన్, ఆడిట్ పెండింగ్‌లో ఉన్న వాటిపై సమీక్షించాలని సూచించారు. నేరుగా జిల్లా అధికారులే మాట్లాడి ఎండార్స్‌మెంట్ చేసి, అర్జీదారులకు నాణ్యమైన సమాధానం ఇవ్వాలని తెలిపారు.

రెవెన్యూ సమస్యలపై సమీక్ష.

వివిధ శాఖల వద్ద రెవెన్యూ భూముల సమస్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్య ఉన్నదీ లేనిదీ తెలుసుకుని రిపోర్టు తయారు చేయాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్య, గిరిజన సంక్షేమం, పోలీసు, పంచాయతీరాజ్, డీపీఓ, ఏపీఐఐసీ, మునిసిపాలిటీ, జాతీయ రహదారి, రహదారులు భవనాలు, ఏపీఈపీడీసీఎల్, ఇరిగేషన్, వంశధార, క్రీడలు తదితర శాఖల సమస్యలపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


ఇచ్ఛాపురం: సోమవారం ఉదయం ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న మార్కెట్ జంక్షన్

ఉక్కపోత.. కుండపోత


హిరమండలం : సోమవారం సాయంత్రం కురుస్తున్న వర్షం

- ఉదయం భానుడి ప్రతాపం
- సాయంత్రం గాలీవాన బీభత్సం
- జిల్లాలో విచిత్ర వాతావరణ పరిస్థితులు

శ్రీకాకుళం, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు ప్రతాపం చూపడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. సాయంత్రం పిడుగుల మోత... ఈదురుగాలుల బీభత్సంతో కుండపోత వర్షం కురవడంతో భయాందోళన చెందారు. శ్రీకాకుళంలో సాయంత్రం 4.30 గంటల నుంచి వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. పిడుగులు పడి సరుబుజ్జిలి మండలంలో ఒకరు మృతి చెందగా.. జి.సిగడాం మండలంలో కొబ్బరిచెట్టు దగ్ధమైంది. ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, హిరమండలం, ఎల్.ఎన్.పేట తదితర ప్రాంతాల్లో సుమారు అరగంటపాటు వర్షం కురిసింది. కాలువల్లో మురుగునీరు.. రోడ్లపై వర్షపునీటితో కలసి ప్రవాహాన్ని తలపించింది. ఉద్దానం, మైదాన ప్రాంతాల్లో మామిడి, జీడిమామిడి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. శ్రీకాకుళంలో పెద్దపెద్ద చెట్టు గాలికి విరిగిపోయాయి. మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం.. మళ్లీ ట్రిప్ అవ్వడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

సోమవారం నమోదైన వర్షపాతం(మి.మీటర్లలో)

ఆమదాలవలస(మున్సిపాలిటీ)	46.25
శ్రీకాకుళం (రాగోలు)	45.0
ఎచ్చెర్ల	26.75
శ్రీకాకుళం(ఆర్ట్స్ కళాశాల)	17.5
పలాస	14.5
మందస	14.25
పాతపట్నం (జగ్గిలిబొంతు)	14.25
ఇచ్ఛాపురం(అరకభద్ర)	10.0
హిరమండలం	9.5
రణస్థలం (పైడిభీమవరం)	9.5
టెక్కలి (రావివలస)	9.25
పొందూరు	8.0
లావేరు	5.25
కంచిలి	3.5
మెళియాపుట్టి	2.5


సరుబుజ్జిలి : అప్పన్న మృతదేహం



కొబ్బరి చెట్టుపై పిడుగు

జి.సిగడాం, మే 12(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం మండలం ఎస్‌పీఆర్ పురంలోని ఓ కొబ్బరిచెట్టుపై సోమవారం సాయంత్రం పిడుగు పడింది. బ్రాహ్మణవీధిలో ఐవీ అప్పారావు ఇంటి సమీపంలో పిడుగు పడగా.. కొబ్బరిచెట్టు కాలి దగ్ధమైంది. పిడుగు పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పిడుగుల మోత

- పాలవలసలో గొర్రెలకాపరి మృతి
- మర్రిపాడులో ఆవు..

సరుబుజ్జిలి/సంతబొమ్మాళి/ బూర్జ/ హిరమండలం, మే 12(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి, సంతబొమ్మాళి మండలాల్లో సోమవారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో పిడుగుల మోత మోగింది. సరుబుజ్జిలి మండలం పాలవలసకి చెందిన గొర్రెల కాపరి దాసరి అప్పన్న(47) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. అప్పన్న చిగురువలస పంచాయతీ పరిధిలోని తాడికొండ వద్ద గొర్రెల మందను మేతకు తీసుకెళ్లాడు. ఈ సమయంలో మెరుపులతో పిడుగు పడడంతో అప్పన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య తులసమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

- సంతబొమ్మాళి మండలం మర్రిపాడులో పిడుగుపాటు గురై బడ్డ మల్లేషుకు చెందిన ఆవు (మిగతా 6వ పేజీలో..)

వారెంట్లు.. సమన్లపై ప్రత్యేక శ్రద్ధ

- ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం, క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రతీ కేసులో కోర్టు జారీ చేసిన నాన్-బెయిలబుల్ వారెంట్లు, సమన్ల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారెంట్లు, సమన్ల అమలు, పెండింగ్‌కు గల కారణాలను విశ్లేషించి, పలు సూచనలు చేశారు. కోర్టు జారీ చేసిన ఎన్‌బీడబ్ల్యూ(నాన్-బెయిలబుల్ వారెంట్లు), సమన్ల అమలులో నిర్లక్ష్యం వహించరాదని, వాటిని ప్రాధాన్యతా క్రమంలో అమలు చేయాలని తెలిపారు. మహిళలపై నేరాలు, శారీరక దాడులు, మోసాలు, గృహహింస, హత్య, అట్రాసిటీ, పోక్సో వంటి కేసుల్లో ఎన్‌బీడబ్ల్యూ అమలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. వీటి అమలుకు సంబంధించి ప్రతీ పోలీసు స్టేషన్‌లో రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.వి.రమణ, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాకు చెక్

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీకాంత్‌రెడ్డి


ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

ఇచ్ఛాపురం, మే12(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, చెక్‌పోస్టులో అప్రమత్తంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం పురుషోత్తపురం చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, విధుల్లో అసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒడిశా నుంచి సారా, మద్యంతోపాటు గంజాయి వంటి మాదకద్రవ్యాలు రవాణా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే సురంగిరాజా కోటలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించి.. రికార్డులు పరిశీలించారు. కేసుల నమోదుపై ఆరా తీశారు. నవోదయం-2.0 కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ పి.దుర్గా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నదుల్లో నీటి నాణ్యత బాగుంది

- నాగావళి నది వద్ద శ్రీకాకుళంలో యూనిట్ ఏర్పాటు చేశాం
- కందివలసగెడ్డ వద్ద పరిశ్రమ ట్రయల్ రన్‌లో పైపులు లీకు
- జిల్లాలో నాలుగు కేంద్రాల నుంచి ఎయిర్ శాంపిల్ సేకరణ
- ఆసుపత్రి నుంచి వెళ్లే వ్యర్థాల వాహనాలకు జీపీఎస్‌తో ట్రాక్
- జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ



6లో

పెళ్లెప్పుడవుతుంది బాబూ..

- జిల్లాలో పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు
- 30 ఏళ్లు దాటుతున్నా వివాహాలు కావట్లే
- తల్లిదండ్రుల్లో ఆందోళన
- వివాహ పరిచయ వేదికలకు క్యూ

6లో

మాన్యువల్ బదిలీలు చేపట్టాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్

7లో

రేషన్ సరఫరా బాధ్యత డీలర్లకు అప్పగించండి

- సమావేశాలకు సమయానికి హాజరుకాకపోవడంపై ఆగ్రహం
- పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్

7లో

ఇరువర్గాల మధ్య కొట్లాట

- హత్యాయత్నం కేసు నమోదు

8లో

● జిల్లాలో పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు ● 30 ఏళ్లు దాటుతున్నా వివాహాలు కావట్లే
● తల్లిదండ్రుల్లో ఆందోళన ● వివాహ పరిచయ వేదికలకు క్యూ

పెళ్లెప్పుడవుతుంది బాబూ..



మెళియాపుట్టి మండలం జలగలింగుపురం గ్రామానికి చెందిన ఒక యువకుడు ఇండియన్ నేవీలో పనిచేస్తున్నాడు. నెలకు రూ.70 వేల వరకు జీతం ఉంటుంది. గత మూడేళ్లుగా ఆ యువకుడి తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నా ఇప్పటి వరకు వాళ్లు అనుకున్నా సంబంధం కుదరలేదు.

మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన ఒక యువకుడు సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతి నెలా రూ.60 వేల వరకు జీతం వస్తుంది. తల్లిదండ్రులు వ్యాపారం చేస్తుంటారు. వారికి మంచి ఆస్తులు సైతం ఉన్నాయి. గత ఐదేళ్లుగా ఆ యువకుడు పెళ్లిసంబంధాల కోసం తిరుగుతున్నా వారు అనుకున్న సంబంధం కుదరడం లేదు. విసిగిపోయి కులంతర వివాహానికి సిద్ధమయ్యారు. దీనికోసం ఓ వివాహ పరిచియ వేదికను సంప్రదించారు.

మెళియాపుట్టి మండలం చిన్నహంస గ్రామానికి చెందిన ఒక యువకుడికి ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లతో పాటు ఆస్తులు అధికంగా ఉన్నాయి. ఆ యువకుడు వ్యవసాయం చేస్తుండడంతో పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. పేద ఇంటి పిల్లైనా పరవాలేదని, సంబంధం చూడాలని పెళ్లిళ్ల పేరయ్యలకు చెబుతున్నారు.



మెళియాపుట్టి, మే 12(ఆంధ్రజ్యోతి): పెళ్లెప్పుడవుతుంది బాబూ.. నాకు పిల్ల యాడ దొరుకుతుంది బాబూ అంటూ ఓ సినీ కవి రాసిన ఈ పాట ప్రస్తుత పరిస్థితికి అద్దంపడుతోంది. పెళ్లికాని ప్రసాదులు ఎక్కువవున్నారు. పెళ్లి రెండు జీవితాలను ఏకం చేసే బంధం. ప్రతి ఒక్కరి జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం. అయితే మూడు ముళ్లతో ఏకం కావాలని కోరుకునే ఎంతో మంది అబ్బాయిలకు ప్రస్తుతం పిల్లలు దొరకడం లేదు. మెజార్టీ సామాజిక వర్గాల్లో అమ్మాయిల కొరత వేధిస్తుండడం, మారుతున్న యువతుల అభిరుచుల కారణంగా పెళ్లి సంబంధాలు కుదరడం లేదు. 30 ఏళ్లు దాటిపోతున్నా చాలామంది యువకులకు పెళ్లిళ్లు కావడం లేదు. వివాహ పరిచయ వేదికలకు క్యూ కడుతున్నా ఫలితం శూన్యం. దీంతో వారి తల్లిదండ్రుల్లో నెలకొంటుంది.

అమ్మాయిలకు నచ్చితేనే ముందుకు..

గతంలో ఇంటిలో ఆడ పిల్ల ఉంటే గుండెల మీద కుంపటిగా భావించేవారు. కట్న కానుకలు ఇవ్వడానికి అప్పులు చేసేవారు. అమ్మాయి తరఫున వారికి అబ్బాయి నచ్చితే సరిపోయేది. కానీ, ప్రస్తుతం యువతుల అభిరుచులు మారుతున్నాయి. వారికి నచ్చితేనే పెళ్లి సంబంధాన్ని కుదుర్చుకోవడానికి తల్లిదండ్రులు ముందుకు వెళుతున్నారు. అబ్బాయి వయసు, సంపాదన, కుటుంబ నేపథ్యం, ఆస్తులు ఇలా అన్నీ వారికి నచ్చినట్లు ఉంటేనే సంబంధాలు కుదుర్చుకుంటున్నారు. జిల్లాలో చాలామంది యువకులకు మంచి చదువు, జీతం, ఆస్తులు, హోదా ఉన్నా పెళ్లిళ్లు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మూడు పదుల వయసు దాటుతున్నా తమ పిల్లలకు వివాహాలు కాకపోవడంతో తల్లిదండ్రుల్లో



ఆందోళన నెలకొంటుంది. ప్రస్తుతం అన్ని సామాజిక వర్గాల్లో ఈ పరిస్థితి ఉంది.

పరిచయ వేదికలకు క్యూ..

జిల్లాలో కొన్ని సామాజిక వర్గాలు ఆత్మీయ కలియక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అక్కడ వివాహ పరిచయ వేదికలు ఏర్పాటు చేస్తున్నారు. అబ్బాయిలు తమ పేర్లు నమోదుకు క్యూ కడుతున్నారు. ప్రైవేట్ వివాహ పరిచయ వేదికల్లో సైతం పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ఇటీవల టెక్కలిలో ఒక సామాజిక వర్గం విహహ పరిచయ వేదిక రిజిస్టర్ ఏర్పాటు చేయగా 300 మంది దాటి అబ్బాయిలు పేర్లు నమోదు చేసుకున్నారు. అమ్మాయిలు మాత్రం 30 మంది పేర్లు నమోదు చేశారు. దీన్ని బట్టిచూస్తే అమ్మాయిలకు ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతుంది.

మానసిక సమస్యలు

పెళ్లి కాకపోవడంతో యువకులతో పాటు వారి తల్లిదండ్రులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. 30 ఏళ్లు దాటినా వివాహం జరగకపోవడంతో యువకుల్లో అసహనం, నిరుత్సాహం వంటివి పెరుగుతున్నట్లు మానసిక వైద్యులు తెలుపుతున్నారు. పెళ్లిఎప్పుడు అని అడిగే వారికి సమాధానం చెప్పలేక తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారు. యువ రైతులు, కులవృత్తిదారుల వైపు యువతులు చూడడం లేదు. వారికి ఎన్ని ఆస్తిపాస్తులు ఉన్నా చిన్న ప్రభుత్వం ఉద్యోగం ఉన్నవారికే అమ్మాయిలు ప్రాధాన్యత ఇవ్వడం కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో 20 ఎకరాల భూములు ఉన్నా సంబంధాలు కుదరడం లేదు. ప్రతి గ్రామంలో 20 నుంచి 30 మంది వరకు ముప్పై ఏళ్లు దాటిన యువకులు కనిపిస్తున్నారు. వేరే జిల్లాలకు వెళ్లి ఇతర కులాలకు చెందిన వారితో సంబంధాలు కుదుర్చుకోవడం ఇటీవల కాలంలో ఎక్కువయ్యింది. దీనికి తల్లిదండ్రులు కూడా అంగీకరిస్తున్నారు.

అమ్మాయిల సంఖ్య తగ్గడంతోనే..



ప్రస్తుతం అమ్మాయిల సంఖ్య తగ్గడంతో పెళ్లి సంబంధాలు కుదరడం లేదు. గతంలో ఏడాదికి నేను 100 నుంచి 150 వరకు వివాహాలను జరిపించేవాడిని. కానీ, గత మూడేళ్లుగా 50కి మించి జరగడం లేదు. కులాలు వేరైనా వివాహాలు చేయడానికి తల్లిదండ్రులు సిద్ధపడుతున్నారు. దీనికి కారణం అమ్మాయిలు తక్కువగా ఉండడమే.

- వనమాలి వెంకట రమణమూర్తి శర్మ, రాజరాజేశ్వరి పీఠం, చాపర

గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదు



గతంలో అబ్బాయికి 21, అమ్మాయికి 18 ఏళ్లదాటిన తరువాత వివాహాలు అయిపోయేవి. ప్రస్తుతం ఆడ పిల్లల కొరత కారణంగా మగవారికి 35 నుంచి 40 ఏళ్లు వస్తున్నా వివాహాలు జరగడం లేదు. ఈ ప్రభావం సంతానంపై పడుతుంది.

- ప్రతాప్, మెళియాపుట్టి

నదుల్లో నీటి నాణ్యత బాగుంది

- నాగావళి నది వద్ద శ్రీకాకుళంలో యూనిట్ ఏర్పాటు చేశాం
- కందివలసగెడ్డ వద్ద పరిశ్రమ ట్రయల్ రన్‌లో పైపులు లీకు
- అక్కడ ఉత్పత్తి నిలుపుదల చేశాం
- జిల్లాలో నాలుగు కేంద్రాల నుంచి ఎయిర్ శాంపిల్ సేకరణ
- ఆసుపత్రి నుంచి వెళ్లే వ్యర్థాల వాహనాలకు జీపీఎస్‌తో ట్రాక్
- జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

శ్రీకాకుళం, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రవహిస్తున్న నాగావళి, వంశధార నదుల్లో నీటి నాణ్యత ప్రస్తుతానికి బాగానే ఉందని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) పర్యావరణ ఇంజనీర్(ఈఈ) బి.కరుణశ్రీ స్పష్టం చేశారు. వివిధ అంశాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

● **ప్ర:** జిల్లాలో ప్రస్తుతం ప్రధాన కాలుష్య సమస్యలు (గాలి, నీరు, శబ్దం.. ఇతర రకాలు) స్థానిక ప్రజల ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం చూపుతున్నాయి?

జ: గాలి, నీరు.. ఇతర పర్యావరణ కారకాలు కాలుష్యానికి గురైతే సమస్యలు వాటిల్లుతాయి. ప్రస్తుతం నదుల్లో ప్రమాదకరమైన పరిస్థితి లేదు. నీటి నాణ్యతను పరిశీలించాం. వంశధార, నాగావళి నదులు జిల్లాలో ప్రారంభమైన స్థానం నుంచి ముగిసే చివరి ప్రాంతాల్లో నీటి నమూనాను సేకరించి పరిశీలిస్తున్నాం. ఇప్పటివరకు ఆందోళనకరమైన అంశాలు బయటపడలేదు.

● **ప్ర :** పరిశ్రమలు కాలుష్యానికి దోహదం చేస్తున్నాయి కదా. వాటిని నియంత్రించేందుకు తీసుకున్న చర్యలేమిటి?

జ: సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచించిన ప్రకారం మేజర్, మీడియం, స్మాల్.. ఈ తరహా పరిశ్రమలు.. కేటగిరీల వారీగా కాలుష్యం వెదజల్లే వాటిగా గుర్తించాం. మేజర్ అంటే ఫార్మా రంగం. మన జిల్లాలో పైడిభీమవరంలో మాత్రమే ఫార్మా పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలతో నీటి, వాయు కాలుష్యం సంభవించకుండా ముందస్తు పరిశీలన ఉంటుంది. లాక్ అండ్ కీ పద్ధతుల్లో అనుమతుల మంజూరు ఉంటుంది. కందివలసగెడ్డ (పైడిభీమవరం) వద్ద ఓ పరిశ్రమ ట్రయల్ రన్‌లోనే పైపులు లీకై.. వ్యర్థ పదార్థాలు సముద్రంలోకి వెళ్లాయి. దీనిపై వెంటనే ఆ పరిశ్రమ ఉత్పత్తిని నిలుపుదల చేశాం. కాలుష్యం వెదజల్లితే వెంటనే చర్యలు ఉంటాయి.

● **ప్ర:** నాగావళి, వంశధార వంటి నదుల్లో కాలుష్యం తగ్గించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారా?

జ: కాలుష్యాన్ని తగ్గిండంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నదుల శుభ్రత.. ప్లాస్టిక్ ఏరివేత వంటివి చేపట్టాం. నదుల మొదలు నుంచి చివరి ప్రాంతం వరకు కాలుష్యం ఎలా ఉన్నదీ పరిశీలిస్తున్నాం. శ్రీకాకుళంలో నాగావళి నది వద్దనే నీటి నాణ్యతను పరిశీలించేందుకు ఇటీవల యూనిట్ ఏర్పాటు చేశాం. ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు ఇతర శాఖల అధికారులతో కలసి దాడులు నిర్వహించాం.

● **ప్ర:** శ్రీకాకుళం పట్టణంలో గాలి కాలుష్యం అధికంగా ఉంది. గాలి నాణ్యతను మెరుగుపరచడానికి ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఈ ఏడాది జనవరిలో శ్రీకాకుళం నగరంలో గాలి కాలుష్య స్థాయి పెరిగింది. దీనికి ట్రాఫిక్‌తో పాటు అప్పటి వాతావరణ పరిస్థితులే కారణం. ఆ తర్వాత నుంచి బాగానే ఉంది. పరిశ్రమల నుంచి వెలువడే వాయు కాలుష్యం తెలుసుకునేందుకు జిల్లాలో నాలుగుచోట్ల 'శాంపిలింగ్ లొకేషన్ అడ్రస్'లను ఏర్పాటు చేశాం. శామ్‌క్రిగ్ వీస్టన్ క్వార్టర్స్ (పైడిభీమవరం), జిల్లా కో ఆపరేటివ్ ఆఫీస్ (శ్రీకాకుళం), మున్సిపల్ కార్పొరేషన్ (శ్రీకాకుళం), కేఎల్‌పురం వద్ద నిత్యం గాలి నాణ్యతను పరిశీలిస్తున్నాం. ఇప్పటివరకు పారామీటర్స్ స్థాయి పెరగలేదు.

● **ప్ర:** జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం ఎంతవరకు అమలవుతోంది..?

జ: శతశాతం అమలవుతుందని చెప్పలేం కానీ ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ప్రచారం చేస్తున్నాం. రైతు బజారులో గోగునారతో తయారు చేసిన సంచుల యంత్రాన్ని అందుబాటులో పెట్టాం. ఇప్పుడు అది మొరాయించింది. ప్లాస్టిక్ నియంత్రణ, హోటళ్లు, టీ స్టాల్స్ వద్ద పాలిథిన్ సంచులలో వేడి పదార్థాల నిల్వ, టీ పార్శిల్ తీసుకువెళ్లడం వంటివి మా బోర్డు పరిధిలో ఉండవు. ఇవన్నీ మున్సిపల్ అధికారులే చూసుకోవాలి.

● **ప్ర:** జిల్లాలో కాలుష్య నియంత్రణలో ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు ఏమిటి?

జ: శ్రీకాకుళం జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ల్యాబ్ లేదు. ఇటు నీటి, గాలి నమూనాలను సేకరించి.. సిబ్బంది ద్వారా బస్సులో విశాఖలో ల్యాబ్‌కు పంపుతున్నాం. నివేదికలు రాగానే కలెక్టర్‌కు వివరిస్తాం. సిబ్బంది కూడా ఇరవై శాతమే ఉన్నారు. ఇదే మాకు పెద్ద సవాల్. సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమిస్తే.. ఇక్కడ ల్యాబ్ ఏర్పాటైతే పూర్తిస్థాయి ఫలితాలు ఉంటాయి.

● **ప్ర:** కాలుష్యాన్ని తగ్గించడానికి బోర్డు దీర్ఘకాలిక లక్ష్యాలు ఏంటి?

జ: శాశ్వత చర్యల కోసం బోర్డు ఆలోచన చేస్తుంది. నిధులు సంబంధిత మున్సిపాలిటీలకు కేటాయిస్తుంటుంది. దీర్ఘకాలిక లక్ష్యాల విషయాలకొస్తే ఏదైనా పరిశ్రమ ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు రాగానే.. వాటికి ఉన్న ఇతర అనుమతులపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. రెడ్ అయితే 21 రోజులు, ఆరెంజ్ అయితే 15 రోజులు, గ్రీన్ అయితే 7 రోజులలోగా పరిశీలన పూర్తి చేస్తున్నాం. దీనివల్ల నిబంధనలకు అనుగుణంగా అన్ని అనుమతులు ఉంటేనే మేజర్, మైనర్, స్మాల్.. పరిశ్రమలు ఏర్పాటవుతాయి.

● **ప్ర:** వ్యర్థ పదార్థాల నిర్వహణ (ఘన, ద్రవ, ప్రమాదకర వ్యర్థాలు) కోసం జిల్లాలో ఎలాంటి వ్యవస్థలు ఉన్నాయి?

జ: ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి వెలువడే వేస్టేజీని 'రెయిన్‌బో' అనే సంస్థకు అప్పగించాలి. అందుకుగాను ఒక్కో బెడ్‌కు నిర్దేశిత సొమ్ము చెల్లించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మూడు రకాలుగా ఆసుపత్రి వ్యర్థాలు వేరుచేసి పంపాలి. వ్యర్థాలను తీసుకువెళ్లే వాహనాలను మేం కూడా జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పరిశీలిస్తున్నాం. ముందుగా ఆసుపత్రి వ్యర్థాల తరలింపునకు అనుమతి ఉంటేనే.. ఇతర అనుమతులు ఉంటాయి. ఇటువంటి కాలుష్యం వెదజల్లకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంచుతున్నాం. దీనిపై ప్రజలు నేరుగా (9177303291) ఫిర్యాదు చేయవచ్చు. లేదా కలెక్టర్ గ్రీవెన్స్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చు.

ఉద్యాన పంటలకు ఊతం

(ఐదో పేజీ తరువాయి)

ఉద్యాన అభివృద్ధి మిషన్ ఆధ్వర్యంలో 995 ఎకరాలు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా 150ఎకరాలు, కేంద్ర ఆయిల్‌పామ్ మిషన్ ద్వారా 2వేల ఎకరాలు, జాతీయ వెదురు మిషన్ పథకం ద్వారా 25 ఎకరాలు, పంటల వైవిధ్యీకరణ పథకం ద్వారా 150 ఎకరాలు, ఉపాధి హామీ పథకం ద్వారా తోటల విస్తరణ కింద 3,150 ఎకరాలు, కొబ్బరి విస్తరణలో భాగంగా 750 ఎకరాలకు రాయితీ అందించనున్నారు. సాగు చేసేందుకు అనువైన 8,875 ఎకరాల బీడు భూములను గుర్తించనున్నారు. వాటిని సాగు చేసే రైతులకు ఆర్థికసాయాన్ని అందించనున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



గతంలో ఎప్పుడూ లేనంతగా ఉద్యాన పంటలకు రాయితీలు ఇస్తున్నాం. నీటి సౌకర్యం ఏర్పాటు చేసుకొని, ఉద్యాన పంటలను సాగు చేస్తే అధికంగా లాభాలు పొందవచ్చు. ప్రస్తుతం డ్రాగన్ ఫ్రూట్ సాగుతో మంచి లాభాలు వస్తున్నాయి. వీటిపై రైతులు దృష్టి సారించాలి. సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- దుక్క శరత్‌రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి, మెళియాపుట్టి

దరఖాస్తులు ఇలా..

ఉద్యానవన పంటల రాయితీ పొందాలంటే రైతులకు ఐదు ఎకరాల్లోపు భూమి తప్పనిసరిగా ఉండాలి. రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్, ఒక పాస్ ఫొటోతో సమీప రైతు సేవా కేంద్రాల్లో గానీ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో గానీ దరఖాస్తు చేసుకోవాలి. వాటిని క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలిస్తారు. అనంతరం అర్హులైన రైతుల ఖాతాకు నేరుగా రాయితీ సొమ్ము జమ చేస్తారు.

రైతులకు మేలు

ప్రస్తుతం ఉద్యాన రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ సమయంలో ప్రభుత్వాలు ఉద్యానవన సాగు పెంపుపై దృష్టి సారించడం ఎంతో సంతోషం. రాయితీలు అందించి, సాగుకు సహాయం చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

- బొడ్డ వైకుంఠరావు, రైతు, పెద్దకొజ్జిరియా

ఆనందంగా ఉంది



గతంలో ఉద్యానవన పంటలు సాగు చేసినా రాయితీలు సరిపోక అప్పులు పాలయ్యాం. ఇప్పుడు ప్రభుత్వం రాయితీ పెంచడం ఆనందంగా ఉంది. నేను ఏటా వివిధ పూలను సాగు చేస్తుంటా. పెంచిన రాయితీతో ప్రయో జనం కలుగనుంది.

- ఎస్.నారాయణరావు, బందపల్లి, గిరిజన రైతు, మెళియాపుట్టి

పిడుగుల మోత

(ఐదో పేజీ తరువాయి)

మృతి చెందింది. పొలంలో ఆవు మేత మేస్తుండగా పిడుగు పడి మృతి చెందిందని మల్లేషు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తమకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని వేడుకున్నాడు.



సంతబొమ్మాళి: పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఆవు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సరుబుజ్జిలి మండలంలో ఈదురుగాలులు ధాటికి పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడ్డాయి. దీంతో సుమారు ఐదు గంటలు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పాలకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరుబుజ్జిలి 33 కేవీ సబ్‌స్టేషన్‌కు రావాల్సిన విద్యుత్ వైరుపై నీలగిరి చెట్టు కూలిపోయింది. దీంతో మధ్యాహ్నం మూడు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయి.. రాత్రి 8 గంటలైనా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కూలిన చెట్లు

బూర్జ మండలంలోని రాజుపేట, బూర్జ రోడ్డు వద్ద సోమవారం వీచిన భారీ ఈదురుగాలులకు పెద్ద చెట్లు కూలిపోయాయి. ఎస్‌ఐ ప్రవల్లిక, పోలీసులు, పాలకొండ ఆర్టీసీ డీఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం-పార్వతీపురం ప్రధాన రహదారిపై ఉన్న చెట్లను తొలగించారు.



సరుబుజ్జిలి: విద్యుత్‌లైన్‌పె కూలిన చెట్టు



పక్షిని పట్టుకున్న ఓంకార్‌త్యాడి, అటవీ సిబ్బంది

ఎగరలేక..!

పలాస, మే 12(ఆంధ్రజ్యోతి): పలాస బైపాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారి ఎమ్మెల్యే గౌతు శిరీష ఇంటికి సమీపంలో ఓ వెల్డింగ్ షాపు వద్దకు ఎగరలేని స్థితిలో ఉన్న పెద్ద సైబీరియా పక్షి (గూడకొంగ) సోమవారం చేరుకుంది. విషయం తెలుసుకున్న ఈస్టన్ ఘాట్స్ వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు ఓంకార్ త్యాడి, కాశీబుగ్గ అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని అతి కష్టమ్మీద దానిని పట్టుకున్నారు. పక్షి ఆరోగ్య పరిస్థితి క్షీణిం చడంతో స్థానిక పశు వైద్యశాలకు తరలించారు. పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ పి.చంద్ర శేఖర్ వైద్య పరీక్షలు చేసి పక్షి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. వయో భారం, ఉండ తీవ్రత కారణంగా అనారోగ్యంబారిన పడిందన్నారు. ఆరోగ్యం కుదుట పడిన తరువాత టెక్కలి మండలం తేలినీలాపురం పక్షుల సంరక్షణ కేంద్రానికి తరలి స్తామని తెలిపారు. ఈ పక్షి 9 కిలోల బరువు ఉందని, ఇంత భారీ పక్షిని చూడడం ఇదే మొదటి సారని అధికారులు చెబుతున్నారు.

ఘనంగా అన్నమయ్య జయంత్యుత్సవాలు

జిల్లాలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంత్యుత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగర సంకీర్తన నిర్వహించారు.

శ్రీకాకుళం కల్చరల్/ ఎచ్చెర్ల/ ఇచ్ఛాపురం, మే 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిరంలో తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవం సందర్భంగా శ్రీవాణి సంగీత కళాక్షేత్రంలో అధ్యక్షుడు దుంపల ఈశ్వరరావు ఆధ్వర్యంలో సంగీతార్చన నిర్వహించాయి. శశశ్రీ నృత్య కళానికేతన్ నృత్య దర్శకులు రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనలపై ప్రత్యేక నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. అన్నమయ్య పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. అనంతరం కాలభైరవి పీఠం వ్యవస్థాపకుడు గణేష్, మాజీ ఎంపీపీ కూన ప్రమీల, నృత్య దర్శకురాలు నీరజ సుబ్రహ్మణ్యం అన్నమాచార్యుల చిత్రపటానికి పూలమాల వేశారు. అలాగే స్థానిక కలెక్టర్ బంగ్లా దరి కల్యాణ తిరుమలలో గల శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వస్వామి వారి దేవస్థానం శ్రీవారి సేవకులు నగర వీధుల్లో అన్నమాచార్యులు చిత్ర పటంతో శోభాయాత్ర నిర్వహించారు.



ఎచ్చెర్ల: నగర సంకీర్తన నిర్వహిస్తున్న దృశ్యం

● ఎచ్చెర్లలోని శ్రీనివాస ప్రార్థనా మందిరంలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంత్యుత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు ఆదిమూల వెంకటపతి దాసు, నాగేశ్వరశర్మ, ఎస్‌పీవీ రమణ, నీలం కుమార్, విజయకుమార్, రాజారావు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: అన్నమాచార్యుల చిత్రపటాన్ని ప్రదర్శిస్తున్న సంగీత పాఠశాల విద్యార్థులు

● ఇచ్ఛాపురం మండలం తేలుకుంచిలోని సరస్వతి సంగీత విద్యాలయంలో సంగీత గురువు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవం నిర్వహించారు. సంగీత కళాశాలలో అన్నమాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నమాచార్య చిత్రపటంతో కోలాటంతో పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. అనంతరం కళాశాలలో అన్నమయ్య సంకీర్తన ఆరాధన జరిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు రామప్రసాద్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండరాదు: ఎస్పీ



వృద్ధుల వద్దకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరిస్తున్న మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం,మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండరాదని వాటి పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో 61 వినతులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, పరిశీలించారు. సంబంధిత అధికారులకు తక్షణమే ఫోన్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేదని తెలిపారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలోగా జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో అందజేయాలని కోరారు.వృద్ధులు, దివ్యాంగుల వద్దకు ఎస్పీ స్వయంగా వెళ్లి, అర్జీలను స్వీకరించారు.

అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేయాలి

రణస్థలం, మే 12 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సిబ్బందికి ఆదేశించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గంపరిధిలో అసంపూర్తిగాఉన్న అంగన్‌వాడీభవన నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా భవనాలపనులు పూర్తిచేసివినియోగంలోకి తీసుకురావడానికి తీసుకోవల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సమస్యలపై సంబంధిత మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో టెలిఫోన్‌లో మాట్లాడారు.సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ డీఈ సనపల శ్రీరామూర్తి, సీడీపీవో ఝాన్సీబాయ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

సరుబుజ్జిలి, మే 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చిన్నకాగితాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యాసంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటి విద్యార్థికి ఆర్థికసాయం అందించారు. తెలుగుపెంట గ్రామానికి చెందిన నడిమింటిఉగాది ఆటోనడుపుకొని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ఉగాదికి పక్షవాతం రావడంతో కాలు చచ్చుబడిపోయింది. దీంతో జీవనోపాధి లేకపోవడంతో మంచానపడిన ఉగాది కుటుంబానికి పూర్వ విద్యార్థులు సోమవారం రూ.40 వేలు అందించారు.

పురుగు మందుల వినియోగం తగ్గించాలి: ఏవో

సోంపేట, మే 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పురుగు మందులు, రసాయనాల వినియోగం తగ్గించాలని ఏవో బీనరసింహమూర్తి కోరారు. సోమవారం బెంకిలిలో నవధాన్యాల సాగు ఉపయోగంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలోప్రకృతివ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి కుమారి, తులసయ్య, కామరాజు పాల్గొన్నారు.

సమ్మెకు సంపూర్ణ మద్దతు

ఎచ్చెర్ల, మే 12(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తెలిపారు.సోమవారం ఎచ్చెర్లలో సీపీఎం 80వవార్షిక విజయోత్సవర్యాలీని నిర్వహించారు.కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎల్.రామప్పడు, డి.బంగార్రాజు, టి.రామారావు, జి.శ్రీనివాసరావు, ఎల్.సీతారాం, సీహెచ్.సత్యానారాయణ, సురేష్ పాల్గొన్నారు. అలాగే ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన గోడపత్రిక సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఆవిష్కరించారు.

●లావేరు, మే 12 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగులు, కార్మికులు ఈనెల 20న జరిగే అఖిల భారత సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎస్వీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం లావేరులో సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్‌తో ఈనెల 20న సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

22న హనుమజ్జయంతి శోభాయాత్ర

అరసవల్లి,మే12(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలో ఈనెల22న హనుమజ్జయంతి పురస్కరించుకుని నిర్వహించనున్న శోభాయాత్రకు భక్తులు తరలిరావాలని విశ్వహిందూపరిషత్, భజరంగదళ్‌నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామివారిఆలయంలో పూజలు నిర్వహించారు.అనంతరం శోభాయాత్రకు సంబంధించిన బ్యానర్లు, స్టిక్కర్లు, గోడ పత్రికలు, బైక్ స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు లోకనాథం అనందరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.భాస్కర్, టంకాల సూరప్పడు,కొయ్యాన కిరణ్‌కుమార్, రావాడరాజశేఖర్, మెట్ట ధనుంజయ, బొడిగి మధు, ఆనందరావు పాల్గొన్నారు.

గణితంలో మరింత వృద్ధి సాధించాలి

సోంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) :గణితంలో అవధాని మడ్డు తిరుపతిరావు మరింత వృద్ధిసాధించి ఈప్రాంతానికి పేరుతీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ కోరారు. సోమవారం గణితంలో వినూత్నంగా రూపొందించిన గణిత ప్రాజెక్టు జాతీయస్థాయిలో ఎంపికకావడంతో గణిత అవధాని మడ్డు తిరుపతిరావును సోంపేటలో సన్మానించారు.

●కంచిలి, మే 12 (ఆంధ్రజ్యోతి) : బూరగాంలో గణిత అవధాని మడ్డు తిరుపతిరావుకు చతుర్విధ ప్రక్రియలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే గణిత ప్రాజెక్టుకు ఎన్‌సీఈఆర్‌టీగుర్తించడంతో గ్రామస్థులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో బొడ్డు అప్పారావు, కప్పగోపి, మందపాటి శ్రీనివారావు, ఎం.రమేష్, జెడ్పిహెచ్ఎస్ హెచ్ఎం సోమేశ్వరరావు, ఎం.మన్మధరావు, ఢిల్లీరావు, మీన్నారావు, జగన్ పాల్గొన్నారు.

ముగిసిన వైష్ణవ మహాయజ్ఞం

ఇచ్ఛాపురం, మే12(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురంలో ఐదురోజులుగా జరుగుతున్న విశ్వశాంతి ఏకకుండి వైష్ణవ మహాయజ్ఞం సోమవారం ముగిసింది. ఈసందర్భంగా నామయజ్ఞం, పూర్ణాహుతి, ఉట్టికొట్టే కార్యక్రమం నగర సంకీర్తన నిర్వహించారు.అనంతరం సాయంత్రం మహిళలు ఐదురోజులపాటు ఇళ్ల ముందుఉంచిన కుంభాలు,మట్టితో తయారుచేసిన దేవుణి విగ్రహాలతో ఊరేగించారు. గ్రామం సమీపంలోగల బందలో కుంభాలను నిమజ్జనం చేశారు.

నారాయణ తిరుమలలో కల్యాణోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పీఎన్‌కాలనీలో ఉన్న నారాయణ తిరుమలలో ఐదురోజులుగా జరుగుతున్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా సోమవారం స్వామి పుష్పకవచ దర్శనంలో భక్తులకు దర్శనం కల్పించారు. విగ్రహమూర్తులతో తిరువీధి నిర్వహించి, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్యామలరావు, కృష్ణమోహన్, శ్రావణ్ పాల్గొన్నారు.

సాహితీవేత్త శ్రీనివాసరావు మృతి తీరనిలోటు

శ్రీకాకుళం కల్చరల్/పాతశ్రీకాకుళం, మే 12(ఆంధ్రజ్యోతి):సాహితీవేత్త, సుమిత్ర కళా సమితి కార్యదర్శి పులఖండం శ్రీనివాసరావు మృతి తీరని లోటని సుమిత్ర కళా సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకర్ శర్మ, ప్రధాన కార్యదర్శి గుత్తు చిన్నారావు ఒకప్రకటనలో సంతాపంతెలిపారు. శ్రీనివాసరావు సోమవారం మృతి చెందారు.పులఖండం స్వస్థలం రాజాం. శ్రీకాకుళం మండలంలోని ఓ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.ఆయన మృతిపట్ల పలువురు సాహితీవేత్తలు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

జిల్లా రచయితలకు సాహితీరత్న పురస్కారాలు

శ్రీకాకుళం కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన రచయితలకు శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాల్లో సాహితీ రత్న పురస్కారాలు ప్రదానంచేశారు. శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కవి బుర్రి కుమార్ రాజుకు, శ్రీకాకుళానికి చెందిన ఎస్.మహమ్మద్ రఫీకి, కాపురెడ్డి శ్రీనివాస్,తాళ్ళూరి విజయలక్ష్మికి కూడా పురస్కారాలు లభించాయి. జిల్లారచయితలు పురస్కారాలు లభించడంతో రచయితలు శరత్‌బాబు, శ్రీనివాస్, శ్రీనివాసరావు అభినందించారు.

సాగు భూములు కబ్జా తగదు

బూర్జ, మే 12 (ఆంధ్రజ్యోతి): దళితులు సాగు చేస్తున్న భూములను పెత్తందారులు కబ్జా చేయడం తగదని ఏపీ వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం పేర్కొన్నారు. మండలంలోని అన్నంపేట దళితులు, పేదలు తరతరలుగా సాగుచేస్తున్న భూములను కబ్జా గురికావడంపై ఆ భూములను సోమవారం రైతులతో పరిశీలించారు.

అర్జీదారుల భోజన ఏర్పాట్లకు..

దాతలు ముందుకు రావాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



భోజన పంపిణీని ప్రారంభిస్తున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 12(ఆంధ్రజ్యోతి): దూరప్రాంతాల నుంచి పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు దాతల ద్వారా మజ్జిగ పంపిణీ, భోజన ఏర్పాట్లకు ప్రతివారం దాతలు ముందుకురావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరం ఆవరణలో సీఎంఆర్ ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ, భోజనఏర్పాట్లను ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం వంటి దూరప్రాంతాల నుంచి అర్జీదారులు గ్రీవెన్స్‌కు వస్తారని, వారి సౌకర్యార్థం ఉచిత మజ్జిగ పంపిణీ, భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులకు టోకెన్ ద్వారా ఉచిత భోజన సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. సోమవారం సుమారు 200 మందికి మజ్జిగ పంపిణీ, ఉచిత భోజనం అందజేశారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

సరుకుల పంపిణీకి అనుమతించాలి

రెండు నెలలుగా రేషన్ సరుకుల పంపిణీకి వీఆర్వో లాగిన్ ద్వారా సహకరించడం లేదని, ప్రజలు ఇబ్బందులుపడుతుండడంతో సరుకుల పంపిణీకి అనుమతించాలని లావేరు మండలంలోని లక్ష్మీపురం రేషన్ దుకాణం డీలరు దల్లి రమణమ్మ కోరారు.ఈ మేరకు గ్రామస్థులతో కలిసి సోమవారం కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. మే నెల సరుకులు వచ్చాయని, వీఆర్వో లాగిన్ ద్వారా సరుకులు పంపిణీ చేయాలని ఒకటి నుంచి 11వ తేదీ వరకు అడుగుతున్నా స్పందన లేదన్నారు.చివరకు తహసీల్దార్‌కు కూడా వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదన్నారు.

మద్యం షాపును తరలించాలి

జనావాసాల్లో ఏర్పాటుచేసిన మద్యం షాపును తరలించాలని పాతపట్నానికి చెందిన మహిళలు కోరారు. స్థానిక జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. షాపు నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల్లో ఏర్పాటుచేశారని తెలిపారు. మద్యం సేవించి నిత్యం తిరుగుతుండడం వల్ల మహిళలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే మహిళలు, వెలుగు కార్యాలయానికి వచ్చే మహిళా మండలి సభ్యులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పర్యాటక అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం పర్యాటక శాఖపై ఆయన జూమ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రణస్థలం మండలం, కళింగపట్నం, బారువ, భావనపాడు, తదితర బీచ్‌ల అభివృద్ధికి ప్రాజెక్టు రిపోర్టు తయారుచేయాలని ఆదేశించారు. కవిటి బీచ్‌లో పర్యాటకులకు అనుగుణంగాఉన్న స్థలాన్ని గుర్తించాలని అటవీ, పర్యాటకశాఖ అధికారులకు సూచించారు. రూరల్ టూరిజం కింద ఫారెస్టు ఏరియాలో ఎకోఫ్రెండ్లీ ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశమున్నంత వరకు కృషి చేయాలని కోరారు. బీచ్‌ల అభివృద్ధికి ఎక్స్‌ప్రెసెస్ ఆఫ్ ఇంట్రస్ట్ ఉన్నవారిని పిలవాలని కలెక్టర్ ఆదేశించారు. బారువా బీచ్‌లో ప్రస్తుతం వాటర్ స్పోర్ట్స్ గురించి ఆరాతీశారు. సీ కయాకింగ్, ఏటీబీ వెహికల్ నిర్వహిస్తున్నట్లు పర్యాటకాధికారి నారాయణరావు వివరించారు. ఈసమావేశంలో జిల్లా ఫారెస్టు అధికారి వెంకటేష్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ జగదీష్, ఏపీ టూరిజం అధికారులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీయూసీ చైర్మన్ రవికుమార్



అరసవల్లి: కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

మహిళల అభివృద్ధికి కృషి

●జిల్లాలో కుట్టు శిక్షణ కేంద్రాల ప్రారంభం

కార్పొరేషన్ల ద్వారా శిక్షణ ఏర్పాటుచేసి స్వయం ఉపాధి కల్పన తో మహిళల అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యేలు తెలిపారు. సోమవారం జిల్లాలో మహిళా కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభించారు.

సీఎం చంద్రబాబు మహిళా పక్షపాతి: కూన రవికుమార్

ఆమదాలవలస, మే 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ మహిళా పక్షపాతిగా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ద్వారా చేపట్టిన మహిళా కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.వెంకటరావు, కళింగ కార్పొరేషన డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టీడీపీ నాయకులు సంపతిరావు మురళీరావు, అన్నెపు భాస్కరరావు, గొర్లె సూర్యం, నూకరాజు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం: గొండు శంకర్

అరసవల్లి, మే12(ఆంధ్రజ్యోతి):మహిళల ఆర్థికస్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.సోమవారం శ్రీకాకుళం గొంటివీధిలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్లుఎస్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఉచితంగా టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ మాదిగ, రెడ్డి గిరిజా శంకర్ పాల్గొన్నారు.

●గార మే 12 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాబివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. గారలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ ప్రారంభించారు.

21 నుంచి హౌస్ వైరింగ్‌లో శిక్షణ

ఎచ్చెర్ల, మే 12(ఆంధ్రజ్యోతి):ఎచ్చెర్ల మండలకాంప్లెక్స్‌లోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థలో ఈ నెల 21 నుంచి ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎన్.రాంజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని 18-45 ఏళ్లలోపు పదోతరగతి చదివిన యువకులు కోర్సు లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. 30 రోజుల శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెటు అందజేసి, అర్హులైనవారికి బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం ఫోన్ నెంబర్లు 79933 40407, 95534 10809కు సంప్రదిం చాలని కోరారు.

12 లీటర్ల సారా సీజ్

ఇచ్ఛాపురం, మే12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన 12 లీటర్ల సారా ప్యాకెట్లను సీజ్ చేసి సంబంధిత వ్యక్తిని అరెస్ట్ చేశామని ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సీఐ జీవీ రమణ తెలిపారు. సోమవారం బూర్జపాడు గ్రామంలో దాడులు నిర్వహిస్తుండగా,అదే గ్రామానికి చెందిన శివంగి మాధవరావు వద్ద అక్రమంగాఉన్న సారా ప్యాకెట్లును గుర్తించినట్లు చెప్పారు. ఎవరైనా సారా అమ్మినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీకూర్మనాథునికి చక్రస్నానం

గార, మే 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని కల్యాణమహోత్సవంలో భాగంగా సోమవారం వైశాఖ పూర్ణిమ పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు సీతారామ నర్సింహాచార్యులు శ్వేతపుష్కరిణిలో చక్ర నారాయణస్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి జరిగింది. కార్యక్రమంలో ఈవో ఎంకే నరసింహనాయుడు పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి

సోంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో అమరులైన సైనికులకు సోమవారం రాత్రి యువకులు, పట్టణవాసులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ లవరాజు, పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సుల పాత్ర కీలకం

శ్రీకాకుళం రిమ్స్, మే 12(ఆంధ్రజ్యోతి): నర్సులు సమాజంలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తున్నారని నర్సింగ్ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ కె.ఝాన్సీ లక్ష్మీబాయి తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, అంతర్జాతీయ నర్సు దినోత్సవం పురస్కరించుకుని ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో సేవలు అందించడం ఎంతో ఉత్కృష్టమైనదన్నారు. కార్యక్రమంలో ఎం.మీదల్, ఉషా, కె.పద్మావతి, పి.సునీత, హరిప్రియ, కె.శ్రీదేవి, రామదేవి, షర్మిల, ఉషాశ్రీ, అరుణశ్రీ పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో 'బిన్యూ' మొబైల్స్ స్టోర్ ప్రారంభం



'బి న్యూ మొబైల్స్ స్టోర్ ప్రారంభించిన దృశ్యం

పాత శ్రీకాకుళం, మే 12 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలో 'బిన్యూ' మొబైల్స్ స్టోర్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా బిన్యూమొబైల్స్ సీఈవో వై.సాయి నిఖిలేష్ మాట్లాడుతూ కేవలం మొబైల్ ఫోన్లే కాకుండా గృహోపకరణాలపై ఆకర్షణీయమైన డీల్స్ అందజేస్తున్నామని తెలిపారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా సమ్మర్ ఆఫర్లను రూపొందించామని పేర్కొన్నారు. మొబైల్స్‌పై కచ్చితమైన బహుమతులు, ల్యాప్‌టాప్‌లు, టీవీలపై క్యాష్ బ్యాక్, ఎంపిక చేసిన మొబైల్స్‌పై డిస్కౌంట్ వంటివి ఆఫర్లను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయినితీష్ మాట్లాడుతూ పాన్‌కార్డు, ఆధార్ కార్డుతో సిబిల్ అవసరం లేకున్నా బజాజ్ ఫైనాన్స్ ద్వారా వినియోగదారులు సులభంగా సమ్మర్ డీల్స్‌ను అందుకోవచ్చని చెప్పారు. సీఎండీ బాలాజీచౌదరి మాట్లాడుతూ తెలుగురాష్ట్రాల్లో తాము నెలకొల్పిన షోరూముల్లో ఈ ఆఫర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు.

రేషన్ సరఫరా బాధ్యత డీలర్లకు అప్పగించండి

●సమావేశాలకు సమయానికి హాజరుకాకపోవడంపై ఆగ్రహం ● పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు, మే 12(ఆంధ్రజ్యోతి):పొందూరులో ఎండీఎం సిబ్బందికి రేషన్ సరఫరా బాధ్యత నుంచి తప్పించి డీలర్లకు అప్పగించాలని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. సమావేశాలు, ప్రజాప్రతినిధులు సమీక్షలకు సమయానికి రావడం అలవాటు లేదాఅని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం పొందూరులో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. రవికుమార్ ఉదయం 11 గంటలకు సమావేశానికి చేరుకునే సరికి నలుగురు మాత్రమే హాజరుకావడంపై మండిపడ్డారు.తొలుత రెవెన్యూ సమస్యలపై చర్చి జరిగింది. రేషన్ పంపిణీలో ఎండీఎం వాహనాల సిబ్బంది నిరక్ష్యంగా ఉన్నారని, 15వ తేదీ దాటినా పొందూరులో కార్డుదారులకు రేషన్ అందడంలేదని ఎంపీటీసీ బాడాన హారిక రవికుమార్ దృష్టికి తీసుకువెళ్ళారు. అవగాహన లేకుండా తప్పుడు ఫిర్యాదులతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదుపై తీర్మానం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పైడిప్రసాద్, బి.పోలినాయుడు, జె.శ్రీనివాసరావు, ఆర్.లక్ష్మి, పి.వేణుగోపాలరావు, ఎంపీటీసీలు సీతారామరాజు, హనుమంతురావు, అన్నెపుకుమారి, బాడానహారిక, కె.చల్లమాంబ, రాజప్పడు పాల్గొన్నారు. కాగా పొందూరు జూనియర్ కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరగా కోర్టు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు రవికుమార్ వినతిపత్రం అందజేశారు.

మాన్యువల్ బదిలీలు చేపట్టాలి

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్



డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పాత శ్రీకాకుళం, మే12(ఆంధ్రజ్యోతి):ఎస్జీటీలకు మాన్యువల్ బదిలీలు చేపట్టాలని, మోడల్ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 75కి మించితే, టీఎస్ హెచ్ఎం పోస్టు అదనంగా కేటాయించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కిషోర్‌కుమార్ కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట పాఠశాలల పునర్వవస్థీకరణ, బదిలీలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలపరిష్కారానికి యూటీఎఫ్‌జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ జీవో-117ను రద్దుచేసి, దాని స్థానంలో కొత్తజీవోను తీసుకురావాలని, కొత్త జీవో ప్రకారమే పాఠశాలల పునర్వవస్థీకరణ చేపట్టాలని డిమాండ్‌చేశారు.సెలవుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని, బదిలీలకు ముందే ప్లస్ టూ హైస్కూల్లో ఇంటర్ బోధనకు అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్‌చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 15న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్‌కు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో వైకుంఠరావు, బి.రవికుమార్, కె.రమేష్‌కుమార్, జి.నారాయణరావు, వాసుదేవరావు, కోదండరావు, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ప్రచారం

అరసవల్లి, మే12(ఆంధ్రజ్యోతి):మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలకు ప్రభుత్వం మంచి చేస్తుంటే, అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ సీఎం జగన్ అసత్య ప్రచారానికి పూనుకుంటున్నారని టీడీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కలగ జగదీష్ ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధే టీడీపీ లక్ష్యమని తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో గల జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కుట్టుమిషన్ల పంపిణీలో కుంభకోణమని వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత శిక్షణ, కుట్టుమిషన్లు పంపిణీ చేసి వారిని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో చూడాలనే ప్రయత్నం చేస్తుంటే వారి పత్రికలో ఇటువంటి తప్పుడు రాతలు రాయిస్తున్నారని విమర్శించారు.

స్వచ్ఛ సమాజ నిర్మాణం అందరి బాధ్యత: జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 12(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సమాజ నిర్మాణం అందరి బాధ్యత అని జేసీ అహ్మద్‌ఖాన్ తెలిపారు.సోమవారం నగరంలోని క్లీన్‌శ్రీకాకుళం సంస్థకు చెందిన యువకులను అభినందించారు.పదోతరగతి చదువుతున్నవిద్యార్థులు,20ఏళ్ల లోపు వయసు గల యువకులుకలిసి సంస్థను స్థాపించి, ఖాళీసమయాల్లో వివిధ గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను చేపట్టడంపై ఆనందం వ్యక్తంచేశారు. విద్యార్థులు, యువత సెల్ ఫోన్లకు, చెడు అలవాట్లకు గురికాకుండా కొంతసమయాన్ని సమాజం కోసం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జీవన్, హర్షల్ సాయిచరణ్, పవన్,రఘునందన్ పాల్గొన్నారు.

కాలువలో చిక్కుకున్న దూడ

- పారిశుధ్య సిబ్బంది చొరవతో బయటకు..
- ఊపిరిపీల్చుకున్న పట్టణవాసులు

పలాస, మే 12(ఆంధ్రజ్యోతి): కేటీ రోడు హైస్కూల్ జంక్షన్‌లో మురుగు కాలువలో సోమవారం ఉదయం 6 గంటల సమయంలో ఓ ఆవుదూడ మురుగు కాలువలో పడి పోయి బయటకు వచ్చేందుకు మార్గం తెలియక అల్లాడింది. అటూ ఇటూ తిరుగుతూ


బయటకు తీయగా..

లోపలకు వెళ్లి పోయింది. అయితే కాలువలో పడిన దూడను చూసిన వాకర్స్ గుర్తించారు. దానిని బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో వెంటనే మునిసిపల్ కమిషనర్ ఎస్.రామారావుకు సమాచారమిచ్చారు. ఆయన ఆదేశాలతో పారిశుధ్య కార్మికులు వచ్చి కాలువలోకి దిగి దూడను పరిశీలించారు. అయితే బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. వెంటనే ఎక్స్‌కవేటర్‌తో


చెంగు చెంగున వెళ్లిపోతూ

కాలువలపై పలకలు తొలగించి ఎట్టకేలకు దానిని బయటకు తీశారు. ఈ దూడ చెంగు చెంగున పరిగెట్టి వెళ్లి పోయింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇరువర్గాల మధ్య కొట్లాట

- హత్యాయత్నం కేసు నమోదు


చికిత్స పొందుతున్న గోపి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ

పలాస, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో బి.గోపి అనే వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. తనను హతమార్చేందుకు ప్రత్యర్థులు వచ్చారని, తప్పించుకోగా తలకు తీవ్రగాయమైనట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యా యత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న గోపి తప్పతాగి తనను ఇబ్బంది పెడుతున్నాడని ఆ వీధిలోనే నివసి స్తున్న రవి భార్య 100కు ఫోన్ చేశారు. ఈ మేరకు పోలీసులు అక్కడికి చేరు కున్నారు. ఉద్దేశపూర్వకంగా తనపై ఫిర్యాదు చేశారని గోపి పోలీసులకు చెబు తూ స్టేషన్‌కు వెళ తున్న క్రమంలో చీకటిలో కాపుకాచిన బి.రవి, వి.భర ద్వాజ్, వి.లక్ష్మణ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గోపి తల, కన్నుపై తీవ్ర గాయాల య్యాయి. ఈ మేరకు క్షతగాత్రుడ్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఇరువర్గాలు దాడి చేసుకున్న వారంతా రక్తసంబం ధీకు లేనని తెలుస్తోంది. పాత కక్షల కారణంగా ఈ దాడులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. టీడీపీ మద్దతుదారుడైన గోపిపై దాడి జరిగిన విషయం తెలుసు కున్న ఆ పార్టీ నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎ.రామకృష్ణ ఆసుపత్రిలో పరామర్శించారు. గోపికి న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి రవాణాదారులకు పదేళ్ల జైలు

పలాస, మే 12(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులకు పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ ఏడీజే కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు సోమవారం తీర్పు ఇచ్చినట్లు పలాస రైల్వే ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా వల్లాడ గ్రామానికి చెందిన అనంతసబార్, రుణకుండంగి 2003 ఆగస్టు 27న 82 కిలోల గంజాయిని ముంబై తరలించేందుకు పలాస రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-2లో వేచి ఉండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని పట్టుకుని అప్పటిలో కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. దీనిపై విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు, రూ.లక్ష అపరాధ రుసుం విధించారు. ఈ కేసును జిల్లా ప్రభుత్వ న్యాయవాది కింజరాపు శ్రీనివాసరావు వాదించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్


స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

కొత్తూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధి పోనుటూరు గ్రామం వద్ద వంశధార నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీ ల్దార్ పి.బాలకృష్ణ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. ఇసుక తరలింపునకు, స్టాక్ పాయింట్‌కు ఎటువంటి అనుమతులు లేకపోయినా యంత్రాలతో నదీ గర్భంలో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సచివాలయ సిబ్బంది పట్టుకుని సమాచారం ఇచ్చారు. వాహనాలను కార్యాలయానికి తరలించామన్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా వేసినట్లు తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి


హరీష్ (ఫైల్)

రణస్థలం, మే 12(ఆంధ్రజ్యోతి): రణస్థలంలోని ఓ ఆస్పత్రిలో ఒకరు చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. జేఆర్‌పురానికి చెందిన బి.హరీష్ (25)తోపాటు గొర్లె భాషా మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై పైడిభీమవరం నుంచి రణస్థలం ఆదివారం అర్ధరాత్రి వస్తు న్నారు. వరిసాం జంక్షన్ వద్ద ఆగిఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో గాయపడిన హరీష్ రణస్థలం ఒక ప్రైవే టు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హరీష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్త శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. గొర్లె బాష ఇచ్చిన ఫిర్యాదు జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్..

లావేరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రావివలస వద్దగల జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ బెల్లంకొండ రమేష్ (37) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం నుంచి పైడిభీమవరం వైపు మూడు లారీలు వరుసగా వస్తున్నాయి. ఇందులో మధ్యలో ఉన్న ఐరెన్‌లోడుతో ఉన్న లారీ ముందు ఉన్న గ్రానైట్ లారీని ఢీకొంది. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఐరెన్ లారీ తవుడు లోడుతో వస్తున్న లారీ ఢీకొనడంతో అందులో ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు చెందిన క్లీనర్ రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లావేరు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు చెప్పారు.

మహిళకు తీవ్ర గాయాలు..

ఎచ్చెర్ల, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుశాలపురం గ్రామానికి సమీపంలో శ్రీకాకుళం సింహద్వారం వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు.. లావేరు మండలంలోని బుడుమూరు గ్రామానికి చెందిన గుడ్ల లావణ్య నవభారత్ జంక్షన్‌లోని తన కన్నవారింటికి స్కూటీపై సోమవారం ఉదయం వచ్చింది. ఆమె తిరిగి బుడుమూరు వెళ్లే క్రమంలో కుశాలపురం సింహద్వారం వద్ద సర్వీసు రోడ్డులో స్కూటీతో యూటర్న్ తీసుకుంటుండగా బొబ్బిలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరిన ఆమెను 108 అంబులెన్స్‌పై తీసుకెళ్లి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె భర్త గుడ్ల సూర్య ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎస్.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహజకవి జోగారావు మృతి

పలాస, మే 12(ఆంధ్రజ్యోతి): సహజకవిగా రచయిత గొర్లె జోగారావు (45) సోమవారం సూదికొండ రోడ్డులోని ఆయన నివాసంలో మృతి చెందారు. చిన్నతనం నుంచి పోలియో వ్యాధిబారిన పడి కాళ్లు చచ్చుబడిపోగా, చేతులు కూడా మొద్దుబారాయి. వణుకుతున్న చేతులతోనే కవితలు రాసి అనేక పత్రికలకు అందించేవారు. తరువాత కాలంలో చేతులు పూర్తిగా పనిచేయకపోవడతో సోషల్ మీడియా ద్వారా తన కవితలు అందించి అనేక మంది మన్ననలు పొందారు. ఆయన మృతి పట్ల టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వర రావు, దువ్వాడ శ్రీకాంత్, డిక్కల ఆనంద్, గోళ్ల చంద్రరావు సంతాపం వ్యక్తంచేశారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

- డిప్యూటీ డీఈవో విలియమ్స్

టెక్కలి, మే 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి నైతిక విలువలు పెంపొందించుకోవాలని, వీటికి ఇటువంటి శిక్షణలు దోహద పడతాయని డిప్యూటీ డీఈవో విలియమ్స్ అన్నారు. మండాపోలం కాలనీలో ప్రజా చైతన్య కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాభ్యాసంతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. వేసవిలో వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళా సమితి సభ్యులు కృష్ణారావు, గణపతిరావు, రమణ మూర్తి, తాతయ్య, పద్మనాభరావు, టి.భాస్కరరావు, వీజేఎస్ ప్రసాదరావు, డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ చిలుకు లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్

ఆదివాసీ గిరిజనుల భూములను రక్షించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘ నేతలు

హిరమండలం, మే 12(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనుల భూములను రక్షించాలని ఆ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ.. గులుమూరు పంచాయతీ జగన్నాథపురంలో గిరిజనుల భూములను ఇతరులు ఆక్రమించి మోసం చేశారని, తక్షణం ఆ భూములను ఇప్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ హనుమంతరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకుడు నిమ్మక అప్పన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శిర్ల ప్రసాద్, గిరిజన రైతులు ఊలక దాసు, రుగడ నర్సయ్య, లక్ష్మి, భీముడు, కృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారికి గరుడవాహన సేవ

- వజ్రకవచంతో దర్శనమిచ్చిన శ్రీనివాసుడు

నరసన్నపేట, మే 12(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని రుత్వికులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం వజ్రకవచంతో మూలవిరాట్‌ను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలో హోమా లు, పూజాది కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై వేంచేపు చేసి తిరువీధి ఉత్సవం చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు మార్తి కృష్ణమాచార్యులు, మావుడూరి జగదీష్‌బాబు, జగన్నాథశర్మ, ఆలయ ధర్మకర్తలు, భక్తులుపాల్గొన్నారు.


వజ్ర కవచంతో శ్రీవెంకటేశ్వర స్వామి మూలవిరాట్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

హరిపురం, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. బెల్లుపటియా గ్రామంలో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ కృపాసింధు మా ట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా 15 రకాల విత్తనాలు భూమి లో వేయడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్గున్న సూర్యారావు, భారతి, కరుణ, ఏఈవోలు జగ్గారావు, శంకర్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నరసన్నపేట, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(ప్లస్-2) లో 1990వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం స్థానికంగా ఒక కల్యాణ మండపంలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉన్నా రంగనాథ్, పొట్నూరు సాయిప్రసాద్, గొద్దు చంద్రమౌళి, సుధ, ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

1001 మామిడి పండ్లతో అర్చన



నరసన్నపేట, మే 12(ఆంధ్రజ్యోతి): పెద్దపేట అంజనేస్వామి దేవాలయంలో వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం 1001 మామిడి పండ్లతో రుత్వికులు శివశంకర్ వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మత్స శాంతా, నిరంజన్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను విస్తృతపరచాలి


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్

నందిగాం, మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలను విస్తృత పరిచి రోగుల్లో ప్రభుత్వాసు పత్రులపై నమ్మకం కలిగించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్ అన్నారు. నందిగాం పీహెచ్‌సీని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈహెచ్ఆర్, మందులు, ఓపీ తదితర అంశాలపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యా ధికారి కె.అనితకుమారి, సీహెచ్‌వో దాతారాం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొల్లిపాడు ఆలయ శతాబ్ది ఉత్సవాలు

సంతబొమ్మాళి, మే 12(ఆంధ్రజ్యోతి): కొల్లిపాడు గ్రామంలోని తారకేశ్వర స్వామి శతాబ్ది ఉత్సవాలు మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. వందేళ్ల కింద ట మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జున రెడ్డి తాత తాతన్నాయుడు ఈ ఆలయాన్ని నిర్మిం చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆనాటి నుంచి వారి కుటుంబ సభ్యులు ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదికి ప్రతిష్ఠించి వందేళ్లయిన సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో బుధవారం నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు.

విశ్రాంత వైద్యాధికారిని అరెస్ట్ చేయాలి

పాతపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): బైదలాపురం పీహెచ్‌సీ విశ్రాంత వైద్యాధికారి గణపతి సదాశివను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్టీయూ భవనంలో విలేకరు లతో మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన వైద్యురాలు పలక సత్యవాణిని కులంపేరుతో దూషించి మానసిక హింసకు గురిచేశారని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 21వ తేదీన దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుల నిర్మూలనా పోరాటసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లాప్రధాన కార్యదర్శి దుర్గాశి గణేష్, దళితహక్కుల పరిరక్షణ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, రాకోటి రాంబాబు, వెంకటరమణ, భాస్కరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రామదేవత సంబరాలు

నందిగాం, మే 12(ఆంధ్రజ్యోతి): కొత్తగ్రహారంలో పాలపోలమ్మతల్లి గ్రామ దేవత సంబరాలు రెండోరోజు సోమవారం ఉత్సాహంగా సాగాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కోలాటం, కాంతార, ధూం ధడాకా తదితర ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం అమ్మవారి రథం ఊరేగింపునకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి

జలుమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ ముఖలింగేశ్వరస్వామి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వైశాఖ మాసం 3వ సోమవారం, బుద్ధ పౌర్ణమి పర్వదినం సందర్భం గా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆలయం కిటకిట లాడింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో పి.ప్రభాకరరావు ఏర్పాట్లు చేశారు. శ్రీముఖలింగేశ్వరస్వామితో పాటు సోమేశ్వర, భీమేశ్వరాలయాలను భక్తులు సందర్శించుకొని పూజలు చేసారు.

భక్తిశ్రద్ధలతో వైశాఖ పౌర్ణమి పూజలు

పలాసరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): తర్లాకోట, పండాశాసనం, బ్రాహ్మణ తర్లా, రెంటికోట గ్రామాల తో పాటు పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పూజా రి వీధి, పెద్ద, చిన్న బ్రాహ్మణ వీధుల్లో వైశాఖ శుద్ధ పౌర్ణ మి సందర్భంగా మహిళలు పూజలు చేశారు.

ఘనంగా తిరువీధి


తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, మే 12(ఆంధ్రజ్యోతి): గొప్పిలిలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో విగ్రహాల తిరువీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్ బాబు, సర్పంచ్ పల్లి మోగి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న ఆలయ వార్షికోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాతపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): బోరు భద్ర గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ 38వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో ప్రారం భమైన కార్యక్రమంలో విశేష పూజలతో పాటు స్వామి వారి కల్యాణం చేపట్టారు. సాయంత్రం స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపులో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి పర్లాకిమిడికి చెందిన శ్రీనటరాజ నృత్యకళాక్షేత్రం బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహిం చారు.

ఆలయ ఆదాయం రూ.7.31 లక్షలు

పాతపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నీలమణిదుర్గ ఆలయానికి 53 రోజులకు రూ.7,31,962 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి టి.వాసుదేవరావు తెలి పారు. ఆలయ హుండీలను దేవదాయ శాఖ ఏసీ కార్యాలయ ప్రతినిధి జీవీబీఎస్ రవి కుమార్ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు.

న్యూస్ బాక్స్

గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాల పెంపుపై హర్షం

సంతబొమ్మాళి, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీల వేతనాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించడంపై ఆ అసోసియేషన్ కోశాధికారి బడ్డ గణేష్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. గతంలో రూ.10 వేలు ఉన్న వేతనాన్ని రూ.27 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దీనికి కృషి చేసిన మంత్రి అచ్చెన్నాయు డుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలపై 13 వినతులు

పలాస, మే 12(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికను కమిషనర్ ఎస్.రామారావు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 13 మంది దరఖాస్తులు అందించారు. మరణ ధ్రువీకరణ పత్రాల కోసం 6, పింఛన్లు-3, ఆస్తి పన్ను మార్పిడి-3, పద్మనాభపురంలో శ్మశాన వాటిక నిర్మించాలని ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు.

సమ్మె నోటీసు

కొత్తూరు, మే 12(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని అంగన్‌వాడీలు, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఐసీడీఎస్ అధికారులను కలిసి సమ్మె నోటీసు అందించారు. గతంలో చేపట్టిన సమ్మె కాలంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలపై తక్షణం జీవో విడుదల చేయాలని యూనియన్ నాయకులు జలజాక్షి, ధనలక్ష్మి, రజని డిమాండ్ చేశారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం పంపిణీలో కీలక పాత్ర వహిస్తు న్న అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదుకోవాలని కోరారు.

యూపీ పాఠశాల అప్‌గ్రేడ్

హిరమండలం, మే 12(ఆంధ్రజ్యోతి) హిరమండలం సుభలయి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఎంపీయూపీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్‌గా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. సోమవారం సీఆర్పీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అప్‌గ్రేడ్ అయిన హైస్కూల్‌కి ఏడు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు కాగా, మోడల్ ప్రైమరీ పాఠశాలలకు ఐదు పోస్టులు మంజూర య్యాయన్నారు. వీటిని బదిలీల్లో భర్తీ చేస్తారన్నారు. ఇటీవల జడ్పీటీసీ పి.బుచ్చిబాబు ఉన్నత పాఠ శాలగా అప్‌గ్రేడ్ చేయాలని కలెక్టర్‌కు, విద్యాశాఖాధికారులకు విన్నవించారు. ఈ మేరకు ప్రభుత్వం హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

టీఏకి నోటీసు

మెళియాపుట్టి,మే,12(ఆంధ్రజ్యోతి): పెద్దపద్మాపురం కస్టర్ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ రమణకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. వేతనదారులతో దురుసుగా ప్రవర్తించినట్లు ఇటీవల పెద్దపెద్మాపురం వేతనదార్లు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గ్రామంలో వివరాలు సేకరించి సంబంధిత నివేదికను డ్వామా పీడీకి పంపినట్లు తెలిపారు.

ముగ్గురు కార్యదర్శుల నియామకం

మెళియాపుట్టి, మే 12(ఆంధ్రజ్యోతి): మూడు పంచాయతీలకు నూతనంగా కార్యదర్శులు కేటాయించబడ్డారని ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు. మండలంలో ఐదు పంచాయతీల కార్యదర్శుల పోస్టులు ఖాళీలుండగా వాటిలో వసుందర, మెళియాపుట్టి, పీఎల్‌పురం పంచాయతీలకు కె.ఢిల్లీరావు, కిషోర్, వాసుదేవరావు నియమితుల య్యారన్నారు.

నేటినుంచి నీటి సరఫరా

నరసన్నపేట, మే 12(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మేజర్ పంచాయతీలో తాగునీటి కష్టాలు తీరనున్నాయి. వారం రోజుల కిందట మోటార్లు కాలిపో వడంతో నీటి సరఫరా నిలిచిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశాలతో కాలిపోయిన మోటార్లను బాగు చేయించి సోమవారం దేవాది పంప్ హౌస్ వద్ద అమర్చారు. మంగళవారం నుంచి వీధుల్లో కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయనున్నామని సర్పంచ్ బి. శంకరరావు, ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, ఈవో ద్రాక్షాయిణి తెలిపారు. ఐదు మోటార్లు రన్నింగ్ కండిషన్‌కు వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

నిస్వార్థంగా సేవలందించాలి

నరసన్నపేట, మే 12(ఆంధ్రజ్యోతి): నర్సులు రోగుల పట్ల దయ కలిగి నిస్వార్థంగా సేవలను అందించాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి హెడ్ నర్సు శాంతి అన్నారు. సోమవారం ప్రపంచ నర్సులు దినోత్సవం సందర్భంగా ఫ్లోరెన్స్ నేటింగేల్‌కు నివాళి అర్పించారు. లేడీ విత్ లాంప్‌గా కీర్తింప బడ్డ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవా లన్నారు.

ఒడిశా మద్యం పట్టివేత

టెక్కలి, మే 12(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సోమవారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో వేర్వేరు కేసుల్లో 32 ఒడిశా టిన్ బీర్లను, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఒక వ్యక్తి వద్ద 18 ఒడిశా టిన్ బీర్లు, ద్విచక్ర వాహనం, మరో వ్యక్తి నుంచి 14 టిన్‌బీర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామన్నారు.